తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అక్టోబర్ 3 నుంచి శ్రీచెంగాళమ్మ శరన్నవ రాత్రులు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి శరన్నవరాత్రులు ప్రారంభమై 12వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి సోమవారం తెలిపారు. 3వ తేదీన శ్రీపరమేశ్వరి అలంకారం, 4న శ్రీ గాయత్రి అలంకారం, 5న శ్రీ అన్నపూర్ణ అలంకారం, 6న శ్రీ బాలాత్రిపురదేవీ అలంకారం, 7న శ్రీ అష్టకాళి అలంకారం, 8న శ్రీమహాలక్ష్మి అలంకారం, 9న శ్రీసరస్వతీ అలంకారం, 10న శ్రీ దుర్గాదేవి అలంకారం, 11న శ్రీరాజరాజేశ్వరి అలంకారం, 12న శ్రీ మహాషాసురమర్ధని అలంకారంతో గ్రామోత్సవం నిర్వహించి శరన్నవరాత్రులు ముగింపు పలుకుతారని తెలిపారు.

## కన్నులపండువగా ప్రదోషనందిసేవ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల దీపారాధన సేవ అనంతరం త్రయోదశి సందర్భంగా ప్రదోష నందిసేవన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలునిర్వహించిన అనంతరం ప్రదోష వెండినందివాహనంపై ఆశీనుల్నిచేసి ఆలయంలో ప్రదక్షిణలు చేయించారు. కార్యక్రమానికి అశేష సంఖ్యలోభక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి, ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ కోలా.ఆనంద్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయాధికారులు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## బ్రహ్మోత్సవాలకు 3న 'అంకురార్పణ'!

### 4న ధ్వజారోహణం
### అదేరోజు తిరుమలకు పట్టువస్త్రాలతో సిఎం

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఏడు కొండలు సిద్ధమయ్యాయి. తిరుమలలో వైభవంగా తొమ్మిదిరోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తొలి ఘట్టంగా గురువారం రాత్రి "అంకురార్పణ" కార్యక్రమం వేదోక్తంగా చేపట్టనున్నారు. ఆలయానికి నైరుతివైపు ఉన్న వసంతోత్సవమండపంలో స్వామివారి సర్వసేనాధిపతి విశ్వక్సేనులవారి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పుట్ట మన్నుసేకరించి దాంతో నవధాన్యాలు మొలకెత్తించే కార్యక్రమం శ్రీకారం చుడతారు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి శ్రీమలయప్పస్వామికి మంగళవారం ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ,చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తదితరాలు తిరుచ్చిలో నాలుగుమాఢవీధులప్రదక్షిణగా ఆలయానికి వేంచేపుచేస్తారు. సాయంత్రం 5.45గంటల నుంచి 6 గంటల మధ్య ధ్వజస్తంభంపైకి గరుడపటాన్ని అధిరోహిస్తారు. ఈ గరుడపటం ధ్వజారోహణంతో వెంకన్న బ్రహ్మోత్సవ వాహనసేవలు మొదలవుతాయి. అక్టోబర్ 04వతేదీ శుక్రవారం రాత్రికి రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారు. తొలివాహనంగా అదేరోజు రాత్రి 9గంటలకు వైకుంఠ శ్రీమహావిష్ణువు కలియుగప్రత్యక్షదైవంగా శ్రీనివాసుడు అవతారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయమాఢవీధుల్లో ఊరేగుతారు. బ్రహ్మోత్సవాలలో ఐదవరోజురాత్రి జరిగే గరుడసేవకు రాష్ట్రముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని 2004 నుంచి బ్రహ్మోత్సవాల ప్రారంభంరోజే సమర్పించడం జరుగుతుంది. 04వతేదీ రాత్రే సమర్పిస్తారు. అనంతరం రంగనాయకుల మండపంలో 2025కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలను సిఎం ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల ఆలయంలో జరిగే సుప్రభాతం మినహా మిగిలిన తోమాల,అర్చన ,కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలుతోబాటు తొమ్మిదిరోజులు అన్ని ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దుచేశారు. పూర్తిగా సర్వదర్శనంలో మాత్రమే భక్తులకు దర్శనం కల్పిస్తారు.

### కల్తీనెయ్యి బాగోతంలో
## స్పీడ్‌గా 'సిట్' దర్యాప్తు
### తిరుమలలో ల్యాబ్‌లో నెయ్యి పరిశీలన






తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం కల్తీనెయ్యితో తయారుచేశారనే వివాదంపై ఏర్పాటైన సిట్ బృందం దర్యాప్తును వేగవంతం చేసింది. సోమవారం మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు సిట్ బృందంలోని ఐజి సర్వశ్రేష్టత్రిపాఠి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మరికొందరు డిఎస్పీలు, సిఐలు తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని తిరుమలలోని మార్కె టింగ్ గిడ్డంగా ప్రాంగణంలోని పిండిమర పక్కన ఉన్న పరిశోధనశాల(ల్యాబరేటరీ)వద్ద నెయ్యిట్యాంకర్లను పరిశీలించింది. ఆ సమయంలో సరఫరా అయిన గోడౌన్‌కు వచ్చిన రెండు నెయ్యిట్యాంకర్లనుండి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో నాణ్యతా పరీక్షచేసే యంత్రాలు, పనితీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆ నెయ్యి ట్యాంకర్లు ఎక్కడ నుండి వచ్చాయి, వాటిని ఎంతటి భద్రత నడుమ తీసుకువచ్చారు అనే కోణంలో కూడా డ్రైవర్లను విచారణ చేశారు.ఇప్పుడు నందిని డైరీ ట్యాంకర్లను తనిఖీ చేశారు. కాగా గతంలో నాణ్యతలేని నెయ్యి సరఫరా జరిగినపుడు ఎలా కనుగొనలేకపోయారు, నెయ్యి నాణ్యత ఎలా గుర్తిస్తారు అనే ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కాగా ఇదే నెయ్యినాణ్యత లేదని తమిళనాడు దిండిగల్‌కు చెందని ఏఆర్ డైరీపై విచారణకు వెళ్లడంతో ముందస్తుగా ఆ డైరీ ఎండి రాజశేఖరన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

## అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి
### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, దేవేంద్ర రెడ్డిలతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 187 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరూ వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్ధవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

## నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కారం
### - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించడంతో పాటు అధికారులు అర్థవంతంగా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వవేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని నూతన గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్యతో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను జిల్లా శాఖాధిపతులు క్షేత్ర స్థాయిలో తమ సిబ్బందితో పరిష్కరించాలని, ఎలాంటి కాలాయాపన చేయరాదని ఆదేశించారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పరిష్కారం కాని సమస్యలకు గల కారణాలను ఫిర్యాదుదారుడికి అర్థమయ్యేలా వివరించాలని పేర్కొన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 237 సమస్యలు**

జిల్లా సచివాలయంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 237 అర్జీలు అందాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యలపై 204 అర్జీలు ప్రజల నుండి అందాయి. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తు కలెక్టర్ సుమిత్‌కుమార్.**

### దసరా ఉత్సవాలకు
## దక్షిణ కైలాసం ముస్తాబు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలకు ముస్తాబౌతుంది.ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఓ వైపు దేవస్థానం మరో వైపు ప్రైవేటు వ్యక్తులు వివిధ దేవి దేవాలయాల్లో నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిం చటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఆలయ ఇఒ తిరుపతి ఆర్‌జెసి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్,ఇఇ మురళీధర్‌రెడ్డితో కలసి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయం వద్ద 9 రోజుల పాటు జరిగే నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లును పరిశీలించారు.అలాగే ముత్యాలమ్మ గుడివీధిలోనూ, ఏడుగంగమ్మలు నిల్చుస్థలంలోని అమ్మవారి ఆలయంలో ఏర్పాట్లును పర్యవేక్షించారు. దేవస్థానం సారధ్యంలో ఆలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయంలోనూ, ఎదురుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయం ఆనవాయితి. అలాగే బాల జ్ఞానాంబ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు.ఇక మహిళా భక్తుల భాగస్వామ్యంతో కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో భారీ ఎత్తున నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ అమ్మవారికి పూజలు అభిషేకాలతో పాటు పొంగళ్ళు పెట్టే సంప్రదాయం అమలులో ఉంది. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో భారీ ఎత్తున అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు.

**ముస్తాబౌతున్న వాసవి అమ్మవారి ఆలయాలు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని బహాదూరుపేట, కొత్తపేట, బజారువీధుల్లో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ఏర్పాట్లు పూర్తి చేసారు.ఇప్పటికే ఈ ఆలయం వద్ద పెద్ద పెద్ద చలువ పందిళ్లు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు. ఉత్సవాల్లో ఏ రోజు ఏ రోజు ఏ అలంకారం చేయాలో ఖరారు చేసారు.ఈ ఆలయాల్లో పాలకమండలితో పాటు వాసవి మహిళా సంఘం వాసవి యువజన సంఘం సంయుక్తంగా కార్యక్రమాలను విజయవంతం చేయటానికి ప్రణాళికలు రూపొందించారు.

## నేడు ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రాక
### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, అటవీ, పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం అక్టోబర్ 1న రాను న్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రమం నుండి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 4.50 గంటలకు అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గం ద్వారా కాలినడకన రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రికి బస చేస్తారు. అక్టోబర్ 2న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం 11.05 గంటలకు మాతృ శ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. అక్టోబర్ 3న సాయంత్రం 4.30 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతిలో జరగనున్న వారాహి సభ కార్యక్రమంలో పాల్గొంటారు. రా. 8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రమం చేరుకుని విజయవాడ తిరుగుప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఇంకెంత కాలం ఈ నిరీక్షణ!
### మిషన్ వాత్సల్య లబ్ధిదారుల వేదన





పాకాల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ఇంకెంత కాలం మాకు ఈ నిరీక్షణ అంటూ మిషన్ వాత్సల్య లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ అనాథ పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మిషన్ వాత్సల్య పథకం ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవడంపై పెదవి విరుస్తున్నారు. కుటుంబంలో తల్లి, తండ్రి లేని పిల్లల విద్య సంరక్షణ నిమిత్తం నెలకు రూ. 4 వేలు వంతున సంవత్సరానికి రూ. 48 వేలు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కరోనా మహమ్మారి బారిన పడి అనారోగ్యంతో కొందరు, ప్రమాదవశాత్తున మరి కొందరు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారి తమ బంగారు భవిష్యత్తును కోల్పోయారు. ఇటువంటి స్థితిలో చిన్నారుల కోసం ఒక ఆశాజ్యోతిగా కనిపించిన ఈ పథకం కార్యరూపం దాల్చడంలో ఎందుకింత జాప్యం అంటూ బాధిత చిన్నారులు ప్రశ్నిస్తున్నారు. ఈ స్కీమ్ ప్రయోజనాల కొరకు బ్యాంకులో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేసి పంచాయితీ సచివాలయ కేంద్రాలలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర దరఖాస్తు అందజేసి ఉన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు మిషన్ వాత్సల్య స్కీంపై ఎటువంటి ప్రకటన రాకపోవడంతో ఎప్పటి నుంచి స్కీం ప్రారంభమౌతుందో అనే స్పష్టత లేకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు ఎన్నికల హామీని గుర్తుంచుకుని వాత్సల్య స్కీము అమలు చేసి బాధిత చిన్నారులను ఆదుకుంటారని ఆశిస్తున్నాము.

## మద్యం దుకాణాల నోటిఫికేషన్ విడుదలలో జాప్యం

### - సెప్టెంబర్ 30కే ప్రభుత్వ మద్యం దుకాణాల గడువు ముగింపు
### - నేటి నుండి మద్యం అమ్మకాలు ఎలా!

చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నాం. అక్టోబర్ 1వ తేదీ నుండి ప్రైవేటు మద్యం దుకాణాల్లో మందు బాబులకు కోరిన బ్రాండ్ మద్యం అందుబాటులో వుంటుంది. ఇది రాష్ట్రంలో నూతన ప్రభుత్వం చెప్పిన మాట. ఇప్పుడు సెప్టెంబర్ 30 ముగిసింది. అక్టోబర్ 1 వచ్చేసింది. ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. అలాగే సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ మద్యం షాపుల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లను తొలగిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి ఇప్పటికీ నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఈ పరిస్థితుల్లో అక్టోబర్ 1 నుండి తాము ఎలా విధులు నిర్వర్తించాలని ప్రస్తుతం మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో నాలుగు నెలల క్రితం ఏర్పాటైన నూతన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేస్తూ దాని స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి నాణ్యమైన మద్యంను తక్కువ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు సిఎం నారా చంద్రబాబునాయుడు కొత్త మద్యం పాలసీని రూపొందించి అమలు చేయాలని నిర్ణయించారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సైతం నూతన మద్యం పాలసీకి ఆమోదం లభించింది. ఈ మేరకు సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడి అక్టోబర్ 1 నుండి ప్రైవేటు మద్యం దుకాణాలు మందుబాబులకు అందుబాటులోకి రావాలి. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 105 ప్రభుత్వ మద్యం షాపులు వున్నాయి. రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ పాలసీ అమలులోకి వస్తే కొన్ని మద్యం దుకాణాలను అదనంగా ఏర్పాటు చేయడానికి మద్యం వ్యాపారులు ఇప్పటికే పక్కాగా ప్లాన్ చేశారు. ఈ మేరకు జిల్లాలో కొత్తగా 17 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. ప్రస్తుతం వున్న మద్యం దుకాణాలతో పాటు కొత్తగా మరో 17 కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు అయితే జిల్లాలో మొత్తం 122 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీతో మందు బాబులు బేజారు పడ్డారు. మద్యం ధర విపరీతంగా పెంచడం, మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం అందుబాటులో వుంచడంతో అత్యధిక మద్యం ప్రియులు రాష్ట్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యంను ఉపయోగించేవారు కాదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం మద్యం వ్యాపారంను ప్రభుత్వం నుండి తొలగించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తామని చెప్పడంతో ఇప్పటికే అత్యధిక ప్రాంతాల్లో మద్యం దుకాణాల కోసం పోటీ విపరీతంగా వుంది.

### మద్యం దుకాణాలకు నేడు నోటిఫికేషన్

ప్రైవేటు మద్యం దుకాణాలకు ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తోంది. సోమవారం అర్ధరాత్రి వరకు నోటిఫికేషన్ జారీకి కసరత్తు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఎలాగైన మద్యం దుకాణాల నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అప్పటి వరకు ప్రస్తుతం వున్న ప్రభుత్వ మద్యం షాపులు కొనసాగించేలా కొత్త ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం వున్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌బాయ్‌లను సెప్టెంబర్ 30 నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఇది వరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయడంలో జాప్యం జరుగడంతో కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చే వరకు ప్రస్తుతం అమలులో వున్న ప్రభుత్వ మద్యం దుకాణాల విధానంను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## 12వ పిఆర్‌సి కమిటీని నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

పాకాల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

పాకాల మండలం స్థానిక పెన్షనర్స్ యూనిట్ కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక పెన్షనర్ల భవనంలో మునస్వామి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి ఎం. కుప్పస్వామి నాయుడు, కోశాధికారి కె. రామమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. జయరామ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు జి. ఆంజనేయులు కార్యవర్గ సభ్యులు హాజరై 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కమ్యూటేషన్ కాలపరిమితిని 12 సంవత్సరాలకు కుదించాలని, డిఆర్‌ఆర్ బకాయిలు అన్నీ కలిపి మొత్తంగా ఒకే వాయిదాలో చెల్లించాలని తీర్మానించారు. సంఘ మాజీ అధ్యక్షులు ఎన్. నారాయణ రెడ్డి, సహాధ్యక్షులు డి. మునస్వామి, ఎన్. మునిరత్నం రెడ్డి, కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ మహిళలపై దాడులను అరికట్టాలి

తవణంపల్లె, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త



ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహిళ లపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టి కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కార్యదర్శి సురేంద్ర నాద్ డిమాండు చేశారు. సోమవారం మండల కేంద్రం తవణంపల్లెలో సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. .ఈకార్యక్రమంలో సంఘం మండల నాయకులు రామారావు, దొరస్వామి, వసంత, భాస్కర్, దేవిక, మమత, చిన్నపాపతమ్మ తదితరులు పాల్గొన్నారు

## సిప్ అబాకస్ విద్యార్థులకు వివిటి ఛాన్సలర్ అభినందనలు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, ఓ ప్రైవేట్ కళ్యాణమండపంలో జరిగిన జోనల్ కాంపిటీషన్ అబాకస్ పోటీల్లో 11 లెవల్స్ పూర్తి చేసిన సిప్ అబాకస్ విద్యార్థులకు వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వివిటి)ఫౌండర్, ఛాన్సలర్ డా.జి.విశ్వనాథన్ అభినందనలు తెలుపుతూ కాన్వకేషన్ పట్టాలను ప్రధానం చేసారు. ఆదివారం సిప్ అకాడమీ ఇండియా లిమిటెడ్ చైర్మెన్ సరళ దినేష్ అధ్యక్షతన సిప్ మిరాకల్ 2024 అబాకస్ జోనల్ కాంపిటేషన్ పోటీలను సిప్ అబాకస్ చిత్తూరు, కాట్పాడి సంస్థల డైరెక్టర్ శ్రీలతమురళీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిప్ అబాకస్ తమిళనాడు ప్రతినిధులు రవిశంకర్, శ్రీరామ్, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు గోపాల్, తిరుపతి సంస్థ కోఆర్డినేటర్ సునీతనాగరాజ్, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం సమైక్యంగా కృషిచేద్దాం

### -కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :

పట్టణాన్ని సమైక్యంగా అభివృద్ధిచేసేందుకు కౌన్సిలర్లు, అధికారులు,ప్రజలు సమైక్యంగా ముందుకు అడుగులు వేయాలని ఛైర్మన్ అలీంబాషా పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఆయన అధ్యక్షతన మున్సిపల్ కమీషనర్ మధుసూదన్‌రెడ్డి కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈమేరకు త్వరలో పట్టణంలో వీధికుక్కల బెడద తప్పించేందుకు చర్యలు ప్రారంభిస్తామని ఛైర్మన్ అలీం స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు,కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## జెటౌన్ వద్ద ప్రమాదం: వ్యక్తి మృతి

పుంగనూరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :

పట్టణానికి చెంది బైపాస్‌రోడ్డులో జెటౌన్ వద్ద సోమవారం మద్యాహ్నం ప్రమాదంలో యువకుడు మృత్యువు పాలయ్యాడు. వివరాలిలా న్నాయి. మండలంలోని చెందిన రంగోనిమిట్టకు చెందిన మహబూబ్‌బాషా పట్టణంలో పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. జెన్యూటౌన్ వద్దకు రాగానే ఒక లాడీ ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని పుంగనూరువైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు.

## ఆవులకొండ ట్రాన్స్‌కో ఎఇగా దానికవేల్

గంగాధరనెల్లూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: జీడినెల్లూరు మండలం ఆవులకొండ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ ఎఇగా ధానికవేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ధానికవేల్ బంగారుపాళ్యం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఎఇగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆవులకొండ సబ్ స్టేషన్ ఎఇగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

## పౌష్టికాహారం తీసుకోవడం అలవరచుకోవాలి

సదుం,సెప్టెంబరు30ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి,రమాదేవిలు అన్నారు. సోమవారం పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాలైన పౌష్టికాహార పదార్థాలను తీసుకువచ్చి ప్రదర్శన గావించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతు పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిదిలో ఇప్పటికేచాలా పంచాయతీలలో మాసోత్సవాలు నిర్వహించామన్నారు. బాలింతలకు, గర్భవతులకు, చిన్నపిల్లలకు, బాలికలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్, రాధ, అంగన్‌వాడీకార్యకర్తలు పార్వతి,అన్నపూర్ణ,అమృతకుమారి,ప్రేమ,మొబీన తదితరలు పాల్గొన్నారు.

## రైతు సంఘం అధ్యక్షుడిగా డి.రమణయ్య



యర్రావారిపాలెం,సెప్టెంబరు30ప్రభాతవార్త

యర్రావారిపాలెం మండల రైతు సంఘం అధ్యక్షుడిగా దానాసి రమణయ్యను నియమించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆశీస్సులతో కూరపర్తివారిపల్లె పంచాయతీ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆయనను రైతు సంఘం అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు కృతజతలు తెలిపారు. రైతులకు అన్ని కార్యక్రమాలలో వెన్నుదన్నుగా ఉంటానని వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## ప్రభుత్వ పథకాలను మాకు భాగస్వామ్యం కల్పించండి

సోమల, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

సోమల మండలంలో జరుగుతున్న ప్రభుత్వ పథకాల గురించి తమకు కూడా తెలియజేయాలంటూ మండల జనసేన నాయకులు ఎంపిడివో నారాయణకు సోమవారం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు గ్రామ సభలు నిర్వహించే సమయంలో తమకు కూడా అవకాశం కల్పించాలని వారు కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు గురించి వారు ఎంపిడివోకు వివరించారు. కూలీలు వలసలు వెళ్లకుండా ప్రతికూలికి పని కల్పించాలని అలాగే రైతుల భాగస్వామ్యం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు నాగభూషనం, హరినారాయణ రఘు, రామకృష్ణ, పవన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి ఎపిఎంగా సుబ్రమణ్యం

### -బాధ్యతలు చేపట్టిన సిసిలు

చౌడేపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

మండల ఎస్‌హెచ్‌జి ఐకెపి ఎపిఎంగా సుబ్రమణ్యం నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న నర్వోత్తమరెడ్డి అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు బదిలీ కాగా వి.కోట నుంచి సుబ్రమణ్యం చౌడేపల్లికి బదిలీపై వచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా రమేష్(చౌడేపల్లి), సుగుణ(దిగువపల్లి), నాగరత్న(లద్దిగం), శ్రీనివాసులు(శెట్టిపేట)క్లస్టర్ సిసిలుగా బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు డిఎంజి రేఖ, స్త్రీనిధిబ్యాంకు మేనేజర్ రమ్యసాయిలు మండలానికి నూతనంగా నియమితులయ్యారు.

## సక్షం పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

శాంతిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సక్షం పథకంలో భాగంగా మండలంలో 19 అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేయనున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సిడిపిఓ కల్పన పేర్కొన్నారు. సోమవారం ఆరిముత్తనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ పథకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అదనపు నిధులు మంజూరవుతాయన్నారు. తద్వారా ఆకుకూరలు, పళ్ల మొక్కలు పెంచడం, విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వర్షపునీటి నిల్వ కోసం నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు విజయ్‌కుమార్, రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదిలీ అయిన సర్వేయర్‌కు సన్మానం

పాలసముద్రం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:



మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ చిత్తూరు డిఎస్‌ఓ కార్యాలయంకు బదిలీ కావడంతో సోమవారం పాలసముద్రం తహసిల్దారు కార్యాలయంలో ఆయ నను ఘనంగా సన్మానించారు. అలాగే పాలసముద్రం మండల సర్వేయర్‌గా జిడినెల్లూరు మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న గణేష్ బాధ్యతలు స్వీకరించడంతో తహసిల్దారు అరుణకుమారి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసిల్దారు అరుణకుమారి మాట్లాడుతూ బదిలీ అయిన కిరణ్ విధి నిర్వహణ పక్కాగా చేశారని, మండలంలో తనకంటూ ప్రత్యేక స్థానంను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు శ్రీనివాసులు, సాదు, పవన్‌కుమార్, శంకర్, సర్వేయర్లు శివ, హరి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## లహరిచే గణిత పాటవ కార్యక్రమం

సదుం,సెప్టెంబరు30ప్రభాతవార్త

మండల పరిదిలోని చెరకువారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 26వ గణిత ప్రజ్ఞాపాటవ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గణిత అవధానం గురువు అరుణ శివప్రసాద్, ఆయన శిష్యురాలు లహరిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా లహరి రెండు అంకెల నుంచి 99 వరకు విద్యార్థులు అడిగి ప్రశ్నలకు సమాదానలు చెప్పింది. అదేవిధంగా రెండంకెల సంఖ్యలో అక్కడక్కడ స్థానాలను బట్టి రాసిన సంఖ్యలో ముందు నుంచి వెనుకకు, అదేవిధంగా వెనుక నుంచి ముందుకు అన్ని సంఖ్యలను కూడా చక్కగా చెప్పింది. రెండంకెల సంఖ్యల మొత్తాన్ని 5 చే గుణించగా వచ్చే జవాబులను కూడా తన ప్రతిభతో బయటపెట్టింది. చివరలో గణితంలో మ్యాజిక్ షోను నిర్వహించారు. ఈప్రదర్శనను విద్యార్థులు ఎంతో ఆసక్తితో తిలకించారు. ఉపాధ్యాయులు ధర్మయ్య, వేణుగోపాల్, సుబ్రమణ్యం, రమణమూర్తి, మోహన్‌రెడ్డి, భాను, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 200 పశువులకు వైద్య పరీక్షలు

సదుం,సెప్టెంబరు30ప్రబాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గోకుల మిషన్ ఆద్వర్యంలో సోమవారం జోగివారిపల్లెలో సచివాలయం వద్ద ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ ఉపసంచాలకులు శ్రీనివాసులునాయుడు ఆద్వర్యంలో పశువుల పునరుత్పత్తికి సంబందించి పలు విషయాలు ప్రజలకు తెలియజేశారు, పశుపోషణలో మెలకువలు వివరించారు. పశువులకు వచ్చే వ్యాధులు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను గురించి తెలిపారు. సర్పంచి అనితాప్రకాష్‌రెడ్డి, ఏపీఎల్‌డీఏ డాక్టర్ సుబ్బారావు, పశువైద్యులు తబ్రై.జ్‌భాషా, చందనప్రియ, మునిచంద్ర, సుబ్రమణ్యం,
పశువైద్య సిబ్బంది మహేష్, ప్రసాద్, జగదీష్, ఆలీ, గౌతమ్, విష్ణు,ముని మురళి, మునీంద్ర,మునికేశవ,నందమోహన్,బాబు తదితరులు పాల్గొన్నారు.
30సదుం2ః వివరిస్తున్న అధికారి

## స్కూల్ గేమ్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

కుప్పంరూరల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. బాడ్మింటన్‌లో నిఖిత, విధేయ్, చెస్‌లో ధనుష్, షాట్‌పుట్‌లో సౌమ్య, ఖోఖోలో నవ్య, నీహాల్ ప్రణవ్, పూజిత, వాలీబాల్‌లో సుమయ, హాకీలో ధనుష్, సిద్ధార్థ్, ఇమ్రాన్, దీపక్, నితీష్‌లు ఎంపికైనట్లు డిజిఎం కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో ఎజిఎం ఫణికుమార్, ఆర్ఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మండలంలో రైతులకు మంజూరైన మినీ గోకులం షెడ్లు నిర్మాణాలను సోమవారం గరిగచీనేపల్లి ఎస్సీ కాలనీలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఇ జ్యోతి, నేతలు శ్రీనివాసులు, చంద్ర, నరసింహులు, శక్తివేలు, శశి, పుల్లయ్య,బంగారు పాల్గొన్నారు. అలాగే చెక్కునత్తం పంచాయతీలో గోకులం షెడ్ నిర్మాణ పనులను రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి చెక్కునత్తం మణి భూమిపూజ చేసి ప్రారంభించారు.

## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గాను కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు అధ్వర్యంలో స్థానిక ఒకేషనల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పట్టణంలో రెండో విడత విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రజలు ముందుకు వచ్చి బియ్యం, దుస్తులు, వంట సామగ్రిలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు షహీన్ తాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ గ్రీవెన్స్‌కు 12 సమస్యలు

చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

చిత్తూరు నగర సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం ప్రజల నుండి 12 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి అత్యధికంగా 8 సమస్యలు కమీషనర్‌కు అందాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంఇ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## దసరా మహోత్సవాలకు ముస్తాబు

కోట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

కోటలోని కోటమ్మ ఆలయంలోనూ, ఇటు విద్యానగర్‌లోని విద్యా గణపతి ఆలయంలో దసరా మహోత్సవాలు పురస్కరించుకొని అక్టోబరు 3 నుంచి 12 వరకు ఈ మహోత్సవాలు జరగనున్నాయి. ఆమేకు అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేశారు. 3న బాలత్రిపురసుందరిదేవి, 4న గాయత్రి, 5న అన్నపూర్ణ దేవి, 6న లలితా త్రిపురసుందరిదేవి, 7న మహచండీదేవి, 8న ధనలక్ష్మీ, 9న సరస్వతిదేవి, 10న కనకదుర్గాదేవీ, 11న మహిషాసురమర్ధిదేవి, 12న రాజరాజేశ్వరిదేవి, అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఆ మేరకు ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## భూ సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే రామకృష్ణ వినతి

వెంకటగిరి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త



నియోజకవర్గంలోని భూ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నియోజకవర్గంలోని రాపూర్, కలువాయి, సైదాపురం మండలాల్లో ఉన్న పలు భూ సమస్యలను కలెక్టర్ ఓ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. భూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎమ్మెల్యేకి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామాన్య ఫిర్యాదుదారులు వలె వెళ్ళి ఎమ్మెల్యే రామకృష్ణ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భూ సమస్యలను కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

## ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ



వెంకటగిరి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్‌గా సూర్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుండి ఆయన వెంకటగిరికి బదిలీ అయ్యారు. నాటు సారా, గంజాయి వంటి అక్రమ విక్రయాలు జరగకుండా గట్టిగా ఏర్పాటు చేస్తానని తెలిపారు.

## రాష్ట్రస్థాయి క్రీడల పోటీలకు చిట్టేడు విద్యార్థులు

కోట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త



కోట మండలం చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్ఎం నిర్మలాదేవిలు ఈ మేరకు అభినందించారు. అండర్ 17 బాలికల విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలకు సిహెచ్ చెంచువందన, ఎం.అశ్విత, జి.సాయి తేజస్విని, పి.కీర్తి ఎంపిక కాగా, అండర్ 14 బాలికల విభాగంలో హ్యాండ్‌బాల్‌కు ఎం.భవ్యశ్రీ, సిహెచ్ రోహిత, అండర్ 14 బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో సిహెచ్ విష్ణువర్ధన్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవి ఆకాంక్షించారు.

## జీతాల కోసం అధికారులను నిలదీసిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు

కోట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో కూలీలతో పనులు చేయించామని మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు తెలియజేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఏపిఓ పూర్ణిమ్మను వారు నిలదీశారు. తమను అర్ధాంతరంగా, కక్ష్యపూరితంగా తెలుగుదేశం ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. తాము పనిచేసిన కాలానికి జీతాలు ఇవ్వాలని కోరారు. తాము అనేక సంవత్సరాల నుంచి పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఆదేశించిన మేరకు కూలీల చేత పనులు చేయించాలమని తెలిపారు. అయితే తమపై కక్ష్య సాధింపులో భాగంగా విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. కనీసం పనిచేసిన కాలానికైనా జీతాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త



ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవడంతో పాటు వాటివల్ల చేకూరే లబ్ధిని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి వారికి న్యాయం చేస్తామని ఆమె తెలిపారు. ప్రస్తుతం వ్యక్తిగత సమస్యలపై పలు అర్జీలు వస్తున్నాయని, వీటన్నింటినీ అధికారులు పరిశీలిస్తారని విజయశ్రీ తెలిపారు. అనంతరం కొన్ని వినతిపత్రాలను ఆమె స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్మయి, ఏఓ కె.రవికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఎజి కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతను కల్పించండి



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలో రోజురోజుకి పెరిగిపోతున్న అనధికార కట్టడాలు, నియంత్రణ లేని ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వీటి నుంచి తక్షణమే విముక్తి కల్పించాలని శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సోమవారం ఆర్డీఓ కిరణ్మయికి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు వినతిపత్రాలు అందజేశారు. శ్రీసిటీ, అపాచి సెజ్‌లలో పనికి వెళ్లే కార్మికులకు ఏర్పాటు చేసిన బస్సులు పట్టణంలో ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేయడం, పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బజారువీధుల్లో రోడ్డుమార్జిన్ వ్యాపారుల ఆక్రమణలతో నడిచి వెళ్లాలంటే కూడా భయంగా ఉందని వారు వాపోయారు. ఈ విషయమై ఎన్ని పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు రోడ్లపై నడిచేందుకు భయపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టర్ అనధికారింగా ఏర్పాటు చేసుకొని ఉన్న రోడ్డు మార్జిన్ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ వ్యాపారాలు చేయిస్తుండటం శోచనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, కుమారస్వామి, సుదర్శనరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పొలం సరిహద్దు వివాదం - పలువురికి గాయాలు

తడ, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

తడ మండలం వాటంబేడులో పొలం సరిహద్దు వివాదం వల్ల కిలివేటి కోటేశ్వరరావుపై అతని ప్రత్యర్థులు దాడి చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. కిలివేటి గణపతి, మావిళ్లపాటి రాజేంద్ర, మావిళ్లపాటి భరత్, కిలివేటి రమణ, మావిళ్లపాటి అలేఖ్యలు దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. తనతో పాటు తన తమ్ముడు సురేష్, తల్లి బుజ్జమ్మ మీద కూడా దాడి చేశారని పేర్కొన్నారు. అదే సంఘటనలో మరో వర్గం కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిలివేటి కోటేశ్వరరావు, కిలివేటి సురేష్‌లు కిలివేటి గణపతిపై దాడి చేసి గాయపరిచినట్లు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇతర రాష్ట్రాల లిక్కర్‌పై దృష్టి పెడతాం: ఎక్సైజ్ సిఐ

వాకాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

ఇతర రాష్ట్రాల నుండి లిక్కర్ తీసుకువచ్చి అమ్మిన ఎడల వారిపై కేసులు నమోదు చేస్తామని వాకాడు ఎక్సైజ్ సిఐ ఆర్‌యువిఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం వాకాడు సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో గంజాయి, ఇతర రాష్ట్రాల నుండి మద్యం, డ్రగ్స్ వంటి పదార్థాలు తెలిసిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను ఆయన కోరారు. త్వరలో ఎక్సైజ్ పాలసీ నూతన విధానం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆ క్రమంలోనే మరో ఒకటి రెండు రోజుల్లో కొత్త షాపులకు టెండర్లు ప్రక్రియ నోటిఫికేషన్ వస్తుందన్నారు.

## చెత్త నుండి సంపద కేంద్రాలు తిరిగి ప్రారంభించిన అధికారులు

వెంకటగిరి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

మండలంలోని పారువోలు, చలికంపాడు గ్రామాల్లో చెత్త నుండి సంపద కేంద్రాలను సర్పంచులు ప్రారంభించారు. గత ప్రభుత్వాలు చెత్త నుండి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో వచ్చిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించారు. ఎంపిడివో కోటేశ్వర రావు కార్యదర్శులకు సూచించారు.

## కడగుంట అరుంధతివాడలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

### పిఆర్‌డి ఈఈ చంద్రశేఖర్

బాలాయపల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

మండలంలోని కడగుంట అరుంధతి వాడలో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయితీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ చంద్రశేఖర్ తెలిపారు. అరుంధతి వాడలో డిఈ, ఏఈ రేణుక సాయిలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఇది మన మంచి ప్రభుత్వాలు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ నిధులు నుండి ఏడు లక్షల రూపాయలను మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేశారు. సర్పంచి అంకయ్య, ఈటిడిపి మండల కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్, మాజీ సర్పంచి చిత్తూరు శంకరయ్య, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ

వాకాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త

వాకాడు మండల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు జాలాది కిషోర్, మేరీ సునీతల తనయుడు అబ్రహం జోసెఫ్ పాల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిపి స్కూల్ విద్యను అభ్యసిస్తున్న 50 మంది విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ చేసారు. సోమవారం వాకాడు మండల పరిషత్ పాఠశాలలోని ఎంఈఓ 1 వాకాడు బివి కృష్ణయ్య, వాకాడు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. ప్రవీణ్ కుమార్, స్థానిక పాస్టర్లు రెవ, ఎన్. ప్రశాంత్ బాబు రెవ, పిసి దయాకర్‌లు జాలాది అబ్రహం జోసెఫ్ కొరకై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ కుమారుని కోల్పోవడం బాధాకరమని, ఆ కుటుంబాలకు భగవంతుడు ఆశీస్సులు ఉంటాయని ఆయన తెలిపారు. అనంతరం ఎస్ఆర్ఎం కళాశాల, చెన్నైలో ఎంటెక్ విద్యను అభ్యసిస్తున్న జాలాది కిషోర్, మేరీ సునీతల కుమార్తె జాలాది ఆశ్రిత ఏంజెలిన్ తన సోదరుని పేరిట తన బీటెక్ కోర్స్‌లో ఇంటర్న్‌షిప్ నందు స్కాలర్‌షిప్‌గా పొందిన రూ. 25000లతో విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంను కొనుగోలు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వక్తలు, కార్యక్రమ ముఖ్య అతిధులు జాలాది ఆశ్రిత ఏంజెలిన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సహోపాధ్యాయురాలు ప్రసూన, డిజె అజయ్ కుమార్, పిబి మహిపతి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 50 లక్షలు విరాళం

గూడూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త



విజయవాడ వరద భాదితులకు సహాయార్థం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుని కలిసి పెన్వర్ కంపెనీ డైరెక్టర్ గంటా మధుకృష్ణలు కలిసి రూ. 50 లక్షలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బీద రవిచంద్ర, ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్, ప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోటలో పౌరహక్కుల దినోత్సవం

కోట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త



ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతి గొప్పవరం పౌరహక్కులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉందని కోట మండల తహశీల్దార్ జయజయరావు అన్నారు. సోమవారం మేజర్ పంచాయతీ కోటలోని నార్త్ గిరిజన కాలనీలో సర్పంచ్ వెంకటరమణమ్మ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జయజయరావు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ అధికారి, సిబ్బందిపై ఉందన్నారు. న్యాయం, ధర్మం, స్వేచ్ఛ, అభ్యున్నతి అనేది కేవలం కొంతమందికి కొన్ని వర్గాల వారికే వర్తించకుండా సమాజంలో ఉండే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకే పౌరహక్కులు ఉన్నాయన్నారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేసే ప్రజలకు వారి హక్కుల ప్రకారం అధికారులు సేవలు చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు చదువుకుంటే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఎస్ఐ పవన్‌కుమార్, గృహ నిర్మాణశాఖ ఏఇ భాస్కర్‌రావు, ఎంఇఓ మస్తానయ్య, ఐసిడిఎస్ అధికారి మునికుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## యువతకు ఉపాధికల్పనే టిడిపి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నింద్ర,సప్టెంబరు 30 ప్రభాతవార్త : యువతకు ఉపాధి కల్పించడమే టిడిపి ప్రభుత్వ లోక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు.సోమవారం మండల కేంద్రంలో ట్రైరోమేర్ టెక్నాలజీ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ సందర్శించి యువత ఉపాధి కల్పన నియోజకవర్గం నింద్ర,విజయపురం మండలలో పారిశ్రామికవాడ ఏర్పాటుపై కొందరు పారిశ్రామిక వేత్తలతో చర్చించినారు. ఈసందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం నింద్రలో ఏర్పాటు చేసిన ట్రైరోమేర్ కంపెనీ జీరోవేస్ట్,కెమికల్ లేకుండా కాలుష్యం లేని విధంగా కంపెనీ నడుస్తుందని భారతదేశంలో కెనాడ టెక్నాలజీతో నడుస్తుందని నగరి నియోజకవర్గంప్రభుత్వం తరపున ప్రోత్సహకాలు అందిస్తే మరో వంద కోట్లుతో మరో మూడు కంపెనీలు ఏర్పాటు చేయడానికి సిద్దంగా ఉందని కంపెనీ చేర్మన్ బి.కె జిలన్ వెల్లడించట్లు ఆయన తెలిపారు. నింద్ర, విజయపురం తమిళనాడు సమీప ప్రాంతం కావడంతో పెట్టుబడులు పెట్టి కంపెనీలు నిర్వహించడానికి ఔత్సహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని అలాంటి వారిని టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో కంపెనీ చేర్మన్ బికె జలన్,యండి ఆదర్ జలన్,తహశీల్దారు శేషగిరిరావు,తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు క్రడా దుస్తులు పంపిణీ

తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో గుజరాత్‌లో జరిగే అండర్ 14 జాతీయ స్థాయి జూడో పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడా దుస్తులను డిఈవో డాక్టర్ వి. శేఖర్, డిఎస్‌డిఓ సయ్యద్‌లు చేతులు మీదుగా సోమవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మెరుగ్గారానిచ్చి ఆంధ్రప్రదేశ్‌కు పథకాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డైట్ లెక్చర్ జయరామనాయుడు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎస్. బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, శ్రీధర్, సాంబశివరావు, రేఖ రాణి, జూడో కోచ్ గోపి అభినందించారు.

### పవన్ వారాహి సభను విజయవంతం చేద్దాం



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ తిరుపతిలో తలపెట్టిన వారాహి సభను విజయవంతం చేయాలని జానపద కళాకారుల సంఘం అద్యక్షులు పులి మామిడి యాదగిరి, జనసేన నాయకులు నరసింహా నాయుడులు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ తిరుమల శ్రీ వారి ప్రసాదంలో కల్తీ విషయంపై ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి చేస్తున్న ఈ వారాహి సభకు సంఘీభావంగా అంతరు తరలిరావాలని కోరారు.

### పలు అంశాలపై స్పందించిన మాజీ ఎంపి చింతామోహన్



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : మాజీ కాంగ్రెస్ మంత్రి చింతా మోహన్ సోమవారం పలు అంశాలపై స్పందిస్తూ తిరుపతి ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, పటేల్, తేజవతి, మునిశోభ తదితరులతో కలిసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళామణులకు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో అమలు పరుస్తున్నట్లు మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ఉద్యోగులు దాదాపు 8 వేల మందికి గత ప్రభుత్వంలో వడమాలపేట నందు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో అమలు పరుస్తున్నట్లు మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిటిడి ఉద్యోగుల దాదాపు 8 వేల మందికి గత ప్రభుత్వంలో వడమాలపేట నందు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి అలిపిరి వద్ద ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంబిఏ చదివి కూలీలుగా, డ్రైవర్లుగా కష్టపడుతున్నారని వీరికి టిటిడి ద్వారా ఒక్క నిరుద్యోగికి ఐదు ఆవులను ఇచ్చి తద్వారా నెయ్యిని సేకరించి తిరుమల శ్రీ వారి లడ్డ ప్రసాదాల తదితర కైంకర్యాలకు నికార్సైన నెయ్యిని వినియోగించవచ్చునని సలహా ఇచ్చారు. తద్వారా నిరుద్యోగ సమస్యతో పాటు కల్తీ నెయ్యి కలకలం కూడా ఉండదన్నారు.

### వైద్య కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : ఎస్‌వి వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల చేత వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ రకములైన మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమారి, అసోసి ప్రొఫెసర్ డాక్టర్ రామాంజనేయులు, డిప్యూటీయూ సివిల్ సర్జన్, వైద్య విద్యార్థులు, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

### పలు కోర్సులకు 2వ కౌన్సిలింగ్, స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : స్విమ్స్ యూనివర్సిటీ తిరుపతిలో 2024 - 25 విద్యా సంవత్సరంకు ఎంఎస్‌సి (నర్సింగ్), ఎంఎస్‌సి ఎహెచ్ఎస్, పిజి, డిప్లొమా, పలు కోర్సుల నందు 53 సీట్లు ఖాళీలు ఉన్నాయని రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్ల తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదిన ఉదయం 8.30 గంటలకు స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందని అందువల్ల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్, నిర్ణీత ఫీజుతో స్విమ్స్ కమిటీ హాల్ (పాత డైరెక్టర్ కార్యాలయం) నందు నిర్వహించబడుతున్న స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యి సీట్ పొందవచ్చునని స్విమ్స్ రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్ల తెలిపారు.

### ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో 47 వినతులు : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో 47 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారులు సంతృప్తి పడేలా ఫిర్యాదులు పరిష్కారం కావాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై ప్రజలు కమిషనర్‌కు వినతులు అందించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిఈలు, సెక్రటరీ రాధిక, ఏసిపి బాలాజీ, రమణ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసిమ్, అకౌంటెండ్ రమేస్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

### సమాజంలో ఎలా ప్రవర్తించాలో మహిళలకు శిక్షణ



తొట్టంబేడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : సమాజంలో మహిళలు ఎలా ప్రవర్తించాలో మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న 'మహిళా సాధికారత విభాగం' తరపున నిర్వహిచారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా విద్యార్థినులు సమాజంలోను, కళాశాలో ఎలా ప్రవర్తిం చాలో పలు ఉదాహరణలతోసవివరంగా వివరించారు. కార్యక్రమంలో ఎ.సుభాషిణి, రుద్రమదేవి, శివలక్ష్మి, లావణ్య, రాజేంద్రుడు విద్యార్థినులను పాల్గొన్నారు.

### క్రీడాభివృద్ధిలో వేగం పెంచండి...శాఫ్‌చైర్మన్‌కు వినతి

శ్రీకాళహస్తి సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : క్రీడాభివృద్ధిలో వేగం పెంచాలని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్‌గా నియమితులైన తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిమిని రవినాయుడుకు విన్నవించారు. కార్యక్రమంలో మిన్నల్‌రవి, నెమళ్ళూరుబుజ్జి, కోటచంద్రశేఖర్, దుర్గాప్రసాద్, కోబాకలక్ష్మణ్, డాక్టర్ తంగరాజన్, పురుషోత్తంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఎంజిఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : మాజీ మంత్రివర్యులు దివంగతనేత స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థంగా అక్టోబర్ 2న గాంధీజయంతి సందర్భంగా ఎంజిఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి గాంధీవీధి వినాయకుని ఆలయం వద్ద సాయంత్రం 4గంటల వరకు నిపుణులైన వైద్యులచే పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ఓ ప్రకటనలోతెలిపారు.

### కోటి ఉద్యోగాలు ఎక్కడ మోడీజీ? : పిడిఎస్‌యు



తొట్టంబేడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : దేశంలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ అవుతోందంటూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ ధ్వజమెత్తారు. అందుకు ఆంధ్ర రాష్ట్రం కూడా ఎర్రతివాచి పరుస్తోందన్నారు. సోమవారం స్థానిక ఆక్స్‌ఫర్డ్ డిగ్రీకళాశాల ఆవరణలో విద్యార్థి సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మోడీ పాలనలో విద్య కార్పొరేటీకరణ అవుతున్నా కనీసం ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ 11ఏళ్ల దాటిపోతున్నా కనీసం 1100 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. యూనివర్సిటీలో అశాస్త్రీయ భావాజాలాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను మోడీ ప్రవేశపెడుతున్నారని విమర్శించారు.తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా ఎస్.జాకీర్, ఉపాధ్యక్షులుగా నరేంద్ర, కార్యదర్శిగా లోకేష్, సహాయ కార్యదర్శిగా మణి, కోశాధికారిగా రిజ్వాన్‌లు ఎన్నికయ్యారు.

### ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నగర మేయర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : నగరంలోని కెన్సస్ హోటల్ నందు వసుంధర జ్యువెలర్స్ అండ్ సేల్స్ ఎగ్జిబిషన్‌ను తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష చేతులు మీదుగా సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ చెందిన వసుందర జ్యువెలర్స్ ప్రదర్శన సోమ, మంగళవారం రెండు రోజులు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. మహిళలు ధరించే డైమండ్స్, వజ్రా వైడూర్యాలచే తయారు చేసిన నక్లెసులు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. వసుంధర జ్యువెలర్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ ఇచ్చట 45 వేల రూపాయిలు నుండి 52 వేల రూపాయిలు వరకు ఒక క్యారెట్ డైమండ్ లభిస్తుందన్నారు.

### నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతుల బకాయిలు ఇప్పించాలి



నింద్ర,సప్టెంబరు 30 ప్రభాతవార్త : మండలంలోని నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ సంబందించి చెరుకు బకాయిలను వెంటనే చెల్లించే విధంగా నగరి ఎమ్మేల్యే గాలి భానుప్రకాష్ చర్యలు తీసుకోవాలని నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతు సంఘం నాయకులు ఆదినారాయణరెడ్డి తెలిపారు.సోమవారం మండల కేంద్రంలో నగరి ఎమ్మేల్యే గాలి భానుప్రకాష్‌ను రైతు నాయకులు కలిసి రైతులకుచెల్లించవలసిన చెరుకు బకాయిలు 37 కోట్లు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకొనే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు,రఘురెడ్డి రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచంలోనే తృతీయ భాషగా హిందీ



పుత్తూరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త : ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే బాషల్లో తృతీయ బాషగా హిందీ నిలిచిందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. సోమవారం స్థానిక డిగ్రీ కాలేజీలో హిందీ బాషా పక్షోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. హిందీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాసం, నృత్యం, చిత్ర లేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హిందీ బాష విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ పి.వెంకటేశన్, డాక్టర్ కందేరిశ్రీదేవి, డాక్టర్ ఎం.శ్రీనివాసులు తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### కల్లివెట్టు విద్యార్థుల ఉత్తరాలకు ప్రశంసా పత్రాలు



బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని పట్టుదలతో పోటీ పరీక్షల్లో పాల్గొన్నప్పుడే వారి ప్రతిభ బయట వెలుగు చూస్తుందని కల్లివెట్టు ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి తెలిపారు. పత్తిపాక ఫౌండేషన్ గరిపెల్లి ట్రస్టు తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవ్వా, తాతలకు ఉత్తరం రాద్దాం రండి కార్యక్రమంలో కల్లివెట్టు ఉన్నత విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో రాసిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి సోమవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం నాదెండ్ల మురళి, సురేష్‌బాబు, వేణుగోపాల్, ఒబ్బుదేవి ప్రసాద్, మాధవీలత, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

### నేడు పుత్తూరులో గొడుగుల సమరసత యాత్ర

పుత్తూరురూరల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: పుత్తూరులో విశ్వ హిందూ పరిషత్ వారిచే శ్రీవారి గొడుగుల సమరసత యాత్ర నేడు మంగళవారం ఉదయం 9 గంటలకు పుత్తూరు ఆర్‌డీఎం గేటు నుంచి ప్రారంభమవుతుందని సుందరమూర్తి తెలిపారు. పుత్తూరులో ఆర్‌డీఎం గేటు నుంచి సుబ్రహ్మణ్య స్వామి గుడి వరకు వెంకటేశ్వర స్వామివారి గొడుగులు పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

**సదాశివేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు**

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12 తేదీ వరకు దేవి శరన్నవరాత్రి ఉతనసవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

### నూతన ఏపీఎంగా డాంగే యాదవ్



సత్యవేడు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపీఎంగా డాంగే యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యకలాపాలను జిల్లాలోని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తానన్నారు.

### రేపు పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభ

విజయపురం, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: రేపు బుధవారం మండలంలోని 25 పంచాయతీ కేంద్రాల్లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. మండలంలో రెండు టీంలుగా ఏర్పడి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గ్రామ సభ నిర్వహించి 2025-26వ సంవత్సరానికి అవసరమయ్యే పనులను సర్పంచ్ అధ్యక్షతన గుర్తించి ప్రణాళిక తయారు చేయాలని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో బబిత తెలిపారు.

### దళితులపై వివక్షత తగ్గలేదు : అంబేడ్కర్ స్టార్ కృష్ణ

రేణిగుంట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి దాదాపు 77 సంవత్సరాలు అవుతున్నా దళితులపై వివక్షత తగ్గలేదని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేడ్కర్ స్టార్ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం అంబేడ్కర్ బహుజన సంఘం తరపున స్టార్ కృష్ణ సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. దళితులకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. అనుకూలంగా స్పందించిన కలెక్టర్ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు స్టార్ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం ఏర్పేడు మండల అధ్యక్షుడు పిల్లపాళెం వాసుదేవ, సంఘంనేతలు చలపతి, ఈశ్వర్, బిట్టు, రాజుపాళెం, రమేష్, సుందర్‌బాబు,హరి, జయచంద్ర, ముని తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ చాటిన ఎస్ జీ ఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

తిరుపతి విద్య,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి యువజనోత్సవాలలో చక్కని ప్రతిభను ప్రదర్శించారని కళాశాల ప్రిన్సిపల్ డా.బి సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలోని డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ సెట్విన్,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు సంయుక్తంగా నిర్వహించిన డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివెల్ లో వివిధ జానపద నృత్య పోటీలలోని జానపద నృత్యం గ్రూప్ డ్యాన్స్ లో యస్.జీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు రవితేజ గ్రూప్ ప్రథమ స్థానాన్ని,ఫోక్ డ్యాన్స్ సోలో లో ప్రసన్న తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.బి సత్యనారాయణ,వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర,డా.జె కొండలరావు, పి.ఉదయ, డా.కే.కోటేశ్వరయ్య,పి కుమార్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ క్యాడెట్ గా ఎన్నికై ప్రశంసా పత్రం,పథకాన్ని సాధించిన విద్యార్థినిని అభినందించారు.

### టైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పవన్ కుమార్

తిరుపతి విద్య,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: గోవాలో ఈ నెల 28,29 తేదీలలో జరిగిన విఫా జీ విన్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో తిరుపతికి చెందిన పవన్ కుమార్ గోల్డ్ మెడలను కైవసం చేసుకున్నారు.గోవా లో జరిగిన ఇంటర్నేషనల్ టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలకు ఐదు దేశాలకు చెందిన క్రీడాకారులు 2000 మందికి పైగా పాల్గొన్నారు.ఈ పోటీలలో పవన్ కుమార్ కనిశెట్టి 75 కేజీల విభాగంలో కైరో జి(ఫైటింగ్) లో బ్లాక్ బెల్ట్ సీనియర్ కేటగిరిలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.

### వాలంటీర్లకు ప్రచార సామాగ్రి పంపిణీ



తిరుపతి విద్య,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నందు గల పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా ఉన్న విద్యార్థిని విద్యార్థులకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పరిరక్షణ ప్రచార సామాగ్రిని అందజేసినట్లు అసోసియేటెడ్ డాక్టర్ బి జగపతి రామయ్య తెలిపారు ప్రచార సామాగ్రిలో మై భారత్ టోపీలు పుస్తకాలు పెన్నులు చేతి తొడుగులు ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలలో చైతన్యం అవగాహన పెంపొందించుకోవాలని అందజేయడం జరిగిందని తెలిపారు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డాక్టర్ ఆర్ వేణు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ అమరావతి,డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ రాజా,మూడవ సంవత్సర విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముగిసిన స్కాట్స్ అండ్ గైడ్స్ శిక్షణా తరగతులు

తిరుపతి విద్య సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ స్కౌట్స్ అండ్ గౌడ్స్ వాలంటీర్లకు బేసిక్ టీచర్ ట్రైనింగ్ కోర్స్ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాలను ఘణంగా నిర్వహించారు.గత పదిహేను రోజులుగా స్థానిక ప్రభుత్వ యూత్ హాస్టల్ లో కేంద్ర మానవ వనరుల శాఖ చే గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ హైయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మరియు కాలేజీ ఎడ్యుకేషన్,ఎస్వీ యూనివర్సిటీ,జె.ఎన్.టి.యు ఎస్కే యూనివర్సిటీ,మొదలగు విద్యాలయా లలో స్కౌట్స్ అండ్ గైడ్స్ బోధించడానికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి అనుమతి పొందింది. హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ సెక్రటరీ డాక్టర్ అతుల్ కుమార్,నేషనల్ చీఫ్ ట్రైనర్ శ్రీ సక్సేనా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిఠల్,స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్,నేషనల్ సభ్యులు పి.దయాకర్,యూత్ హాస్టల్ మేనేజర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

### సత్యవేడు ఎమ్మెల్యేపై సస్పెండ్ ఎత్తి వేయాలి



కేవీబీపురం, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెండ్ ఎత్తి వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని నియోజకవర్గ మండల టీడీపీ యూత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు కోరారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో యూత్ అధ్యక్షుడు ముదిరాజ్ లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి రాజు మాట్లాడుతూ సెప్టెంబరు 5న ఆయనపై లైంగిక వేధింపులు అవియోగం జరిగితే దానిపైన ఆయన హై కోర్టుకు వెళ్ళగా 25 రోజులు జరగడంతో నియోజకవర్గం అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో యువత అధ్యక్షులు కె.వెంకటేశ్వరులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఏ.సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు మునికుమారి, తెలుగు యువత మునిశేఖర్, రాయపేడు సర్పంచ్ బాలాజీ, రాయపేడు సుమన్, సదాశివపురం నరేంద్ర, వెంకటస్వామి, నాగలాపురం ప్రెసిడెంట్ అనిత, వెంకటేశ్వరులు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### 10గంటల్లోపల పెన్షన్ల పంపిణి పూర్తి కావాలి!



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని సుమారు9వేల మందికి పెన్షన్లు మంగళవారం ఉదయం పదిగంటలకు పూర్తి చేయాలని కమిషనర్ బియస్ గిరి సచివాలయ సిబ్బందికి దిశ దెశ నిర్దేశం చేసారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాలులో సచివాలయ సిబ్బంది,,కార్యదర్శులు, క్లస్టర్ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం జరిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల బట్వాడాను సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించాలన్నారు.100 శాతం పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో విషజ్వరాలు రాజ్యమేలుతున్నట్లు పత్రికల్లో వచ్చింది. ప్రతి వార్డులో సచివాలయ ఉద్యోగులు పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

### ఎపిటిఎఫ్ 80వసంతాల వేడుకల్లో పాల్గొనాలి!



శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఎగువ వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎపిటిఎఫ్ సంబరాలను జరుపుకున్నారు. ఎపిటిఎఫ్ స్థాపించి 80 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా అక్టోబర్ 6,7,8 తేదుల్లో విజయ నగరంలో నిర్వహించే సంబరాలకుప్రతి ఉపాధ్యాయుడు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. దీనిని 20వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహాసభలను విజయవంతం చేయటానికిప్రతి ఉపాధ్యాయుడు తరలి రావాలని తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు రేగంటి దేవానంద్ రూరల్ అధ్యక్షులు బి.సరితలు హాజరై ఉపాధ్యాయులకు సమాచారం అందించారు.ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు వెంకటసుబ్బలక్ష్మీ, పోతురాజు, చంద్రకళ, మునికృష్ణారెడ్డి, సుచరిత, యశోద, వినీత తదితరులు పాల్గొన్నారు.

### శ్యాప్ చైర్మెన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : రాష్ట్ర శాప్ చైర్మెన్‌గా నామినేట్ చేయబడిన అనిమిని రవినాయుడుకు సోమవారం శ్రీకాళహస్తి తెలుగు దేశం నాయకులు ముక్కంటీశుని ప్రసాదాలను అందించారు. శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో రవిని మర్యాద పూర్వకంగా కలసి స్వామి వారిప్రసాదాలతో పాటు దుశ్శాలువతో సత్కరించారు. ఆయనకు పలు సమస్యల గురించి వివరించారు. శ్రీకాళహస్తిలో అస్తవ్యస్తంగా ఉన్న ఆడిటోరియంను గురించి వివరించారు. విజయకుమార్‌నాయుడుతో పాటు నింద్ర సుధాకర్, గుత్తా విజయనాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గానికి జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గెలవాలని తాను మోకాళ్ళపై తిరుమలేశుని దర్శించుకుంటానని శ్రీకాళహస్తి తెలుగుదేశం బిసి విభాగం ప్రధానకార్యదర్శి మునిరాజాయాదవ్ సోమవారం మొక్కును తీర్చుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి 43వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయన అనుచరులు మొక్కులు తీర్చుకున్నారు.

### వీధికుక్కల బెడదను నివారించండి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : పురపాలక సంఘ పరిధిలోని 9వ వార్డు దక్షిణకైలాస్‌నగర్‌లో గత కొన్ని నెలలుగా వీధికుక్కల సంఖ్య ఎక్కువైందని దీంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకుగురవుతున్నారని నివాసితుల భద్రతకు ముప్పుకలిగిస్తున్నాయని వీటిని నివారించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శెంజిగరం సుప్రజ, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు వేలు వినతిపత్రం అందించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని వివరించారు.

### అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ



తొట్టంబేడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో మండలంలోని శివనాథపురంలో వెలసిన అమ్మ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు చీరలు పంపిణీచేశారు. అంతేకాకుండా వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వినుత కోట మాట్లాడుత ఎంతోమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించి ఆదుకుంటున్న అమ్మ ఆశ్రమం నడుపుతున్న నిర్వాహకురాలు భూదేవిని అభినందించారు. కార్యక్రమంలో కోట చంద్రబాబు, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

### శాఫ్ చైర్మన్ అనిమిలి రవినాయుడుకు సత్కారాల వెల్లువ

తొట్టంబేడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శాఫ్ చైర్మన్‌గా అనిమిలి రవి నాయుడును సోమవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు ఎస్వీ యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో మర్యాద పూర్వకంగా కలసి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. ఈసందర్భంగా మురళీనాయుడు మాట్లాడుతూ మాజీ మంత్రి, దివంగత నేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో 26వ డివిజన్‌కు మండల నాయకులు ఇన్‌ఛార్జులుగా నియమించడంతో రవినాయుడుతో పరిచయ కార్యక్రమం నిర్వహించిన తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు వేదాంకృష్ణయ్య, కోబాక లక్ష్మణ్, కస్తూరయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# వనరులు సద్వినియోగం చేసుకునిచే దిశగా చర్యలు : కలెక్టర్



చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: గ్రామాల్లో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి చర్యలు చేపట్టే దిశగా కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశహాలులో సోమవారం గ్రామీణ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి వచ్చిన బృంద సభ్యులు ప్రకార్ ఆడ్లె, సయ్యద్ పరవేష్, దేవేంద్ర సింగ్, పరిశ్రమ శాఖ జవహర్‌బాబుతో కలిసి జిల్లాలో వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా గ్రామీణ వనరులను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా వున్న వనరులను సద్వినియోగం చేసుకుని కమ్యూనిటీ నేతృత్వంలో స్వయం సహాయక మహిళలు, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, కోనసీమ జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. ఇందులో భాగగా ఛత్తీస్‌ఘడ్ బృందంతో అధ్యయనం చేయించడానికి నిర్ణయించిందని, జిల్లాలో పాడి పరిశ్రమ, ఉద్యావనశాఖ, వ్యవసాయ శాఖ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పరచడానికి జిల్లాలో వున్న వనరులు, తదితర అంశాలపై చర్చించి క్షేత్ర స్థాయిలో బృంతం పర్యటించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి వ్యవసాయ రంగంలో వరి, వేరుసెనగ, చెరకు సాగు కలదని, ఉద్యాన శాఖకు సంబంధించి మామిడి సాగు జిల్లాలో ఎక్కువ వుందని ఆపై టమోటా, ఆలూ సాగు కలదని, కుప్పం ప్రాంతంలో పండ్లు, కూరగాయల సాగు ఎక్కువగా వుంటుందని తెలిపారు. అలాగే జిల్లాలో పాడి పరిశ్రమ ద్వారా అత్యధిక రైతులు జీవనాధారం పొందుతున్నారని, ఫౌల్ట్రీ పరిశ్రమ సైతం ఇక్కడ వుందని, మల్బరీ సాగు సైతం పలమనేరు, వి.కోట ప్రాంతాల్లో వుందని, చేనేత పరిశ్రమ నగరి ప్రాంతంలో విస్తరించి వుందని అధికారులు బృంద సభ్యులకు వివరించారు. వీటి ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వున్న అవకాశాలను ఛత్తీస్‌ఘడ్ బృంద సభ్యులు సంబంధిత శాఖ అధికారులతో మంగళవారం క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించనున్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నాయకత్వలక్షణాల పెంపులో క్రీడలు కీలకం

- పిఇఎస్ వైద్యకళాశాల డీన్ డా॥ కృష్ణారావు

- పిఇఎస్‌లో ఘనంగా వార్షిక క్రీడా..సాంస్కృతిక కార్యక్రమాలు !!



కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపుదలలో క్రీడలు ఎంతో కీలకంగా ఉంటాయని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం పిఇఎస్‌లో వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆరా -24ను ఘన ంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమలో దాగున్న ఉత్తమ ప్రతిభను కనబరచాలని సూచించారు. ఈ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను మరో రెండు మూడు రోజులు కొనసాగి స్తామన్నారు. ఆటలపోటీలు, సంగీతం, నృత్యం, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డా॥ సుబ్రమణ్య, హెచ్ఒడిలు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా : గంజి



పుత్తూరు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్, చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పదవి లభించిన సందర్భంగా పుత్తూరులోని ఆయన స్వగృహంలో సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల చేనేత కార్మిక యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులు అధికంగా వున్న మంగళగిరి నియోజకవర్గానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహించడం వల్ల పూర్తి స్థాయిలో చేనేత రంగ అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. కార్పొరేషన్ తొలి సమావేశంలోనే నిధులు, విధులు తెలుసుకుని చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, వృత్తి సంరక్షణకు తగిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, గౌరవ అధ్యక్షుడు కె.వి.కుప్పయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెనుమూరు మండల మాజీ ఎంపిపి జి.షణ్ముగ వర్మ మాట్లాడుతూ చేనేత రంగానికి సంబంధించి తిరుపతిలో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపాలని కోరారు. కార్యక్రమంలో నగరి మండల మాజీ ఎంపిపి మీరా, పెనుమూరు శ్రీ రామకృష్ణ చేనేత సొసైటీ అధ్యక్షుడు, డిసిసిబి మాజీ డైరక్టర్ చల్లా బాలాజీ, యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందల బాలాజీ, సీనియర్ నాయకులు ఎన్.అరుణాచలం, లోకనాథంశెట్టి, పి.గోపాల్ శెట్టి, బి.లక్ష్మీపతి, కె.జానకిరాముడు, బి.శేఖర్, గొల్లపల్లికి చెందిన గోలి చలపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు నడుమ జెండా పండుగ : డిఎస్పి



గూడూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : భారీ బందోబస్తు నడుమ జెండా పండుగ నిర్వహిస్తున్నట్లు గూడూరు డిఎస్పి రమణ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జండా పండగ నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని బుధవారం నుండి ప్రారంభమవుతున్న దేవి నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆంజనేయస్వామి జెండా మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం అందరికీ తెలిసిన విషయమే ఈ దేవి నవరాత్రి ఉత్సవాల్లో సంబంధించి సోమవారం పోలీస్ స్టేషన్‌లో గూడూరు డిఎస్పి రమణకుమార్ జండా పండగ సంబంధించిన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో కాలం నుండి ఆనవాదిగా వస్తున్న జెండా పండుగ కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. అదే విధంగా డిజేలు సౌండ్ బాక్సులు పెట్టరాదన్నారు. యువత మద్యం సేవించి జెండా పండక్కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పమన్నారు. అదే విధంగా ఈ ఏడాది గూడూరు పట్టణంలో 22 ఆంజనేయస్వామి జెండాలు విధుల్లో ఊరేగింపు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు వారి సూచనలు సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసరావు, ఎస్ఐలు బి. గోపాల్, తిరుమల రావు పాల్గొన్నారు.

## తారావారాహి అఖండ దీపం శ్రీకాళహస్తి రాక



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : లోక కళ్యాణార్థం సేవా భారత్ ట్రస్టు స్థాపకులు బచ్చు అవినాష్, దేవి చంద్ర సారథ్యంలో చేపట్టిన తారావారాహి అఖండ దీపం సోమవారం ఉదయం శ్రీకాళహస్తి చేరింది. ఈ దీపాన్ని ఆలయ ప్రధానా ర్చకులు సంబంధం గురుకుల్, బ్రహ్మగుడి నుంచి ఆలయం వరకు ఊరేగించారు. కాగా పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో కేరళ పంచవాయిద్యాల మోతతో సాగింది. పీఠాపురంలోని పాతగాయ శక్తిపీఠం నుంచి ఈ నెల 23న యాత్ర ప్రారంభించినట్లు నిర్వాహకులు వివరించారు. తారావారాహి అమ్మవారి దీక్షను11 రోజుల చేపట్టినట్లు వివరించారు. లోక కళ్యాణార్థం అఖండ దీపాన్ని పాదయాత్రగా ద్వారకా తిరుమల చేరుకొని అక్కడ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల క్షేత్రాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తికి చేరుకున్నపుడు శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ మణికంఠేశ్వరాలయంలో పూజలు జరిపి అఖండ దీపాన్ని అవినాష్ దేవి చంద్రకు అందించగా పట్టణంలో ప్రదర్శన జరిపారు. పాదయాత్ర అక్టోబర్ 3 నాటికి పెద్ద తిరుపతి చేరుకుంటుందన్నారు. పొరబాటు ఎవరిదో కానీ అపచారం జరిగిందన్నారు. అందుకే తాను 11 రోజుల పాటు దీక్ష పాటించి అఖండ దీపారాధన చేపట్టామన్నారు.

## వరద బాధితులకు 'విజయం' రూ.10లక్షలు విరాళం



చిత్తూరురూరల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: ఇటీవల విజయవాడలో ఏర్పడిన వరద బాధితుల సహాయార్థం విజయం విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం కలిసి రూ.10,00,116ల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలసి అందజేసారు. అలాగే కాణిపాకం బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుని ఆలయంలో నిర్వహించిన వేలం పాటలో 21కిలోల లడ్డు ప్రసాదాన్ని రూ. 4,25,000ల పొంది ఆ ప్రసాదాన్ని సైతం ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో ఉండాలని, అమరావతి నిర్మాణం ఎలాంటి విఘ్నాలు లేకుండా జరగాలని అందజేసారు. కాగా విజయం కళాశాల అధినేత డా.ఎం.తేజోమూర్తి, అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ శైలజమూర్తిలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. సిఎంను కలిసిన వారిలో ఎట రాజగోపాల్, లైజనింగ్ ఆఫీసరు రమేష్‌బాబు తదితరులు వున్నారు.

## గోవిందునికి అలిమేలుమంగ ట్రస్ట్ గొడుగులు



తిరుమల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్స వాల్లో తమిళనాడు చెన్నై అలిమేలుమంగమ్మ ఛారిటబుల్‌ట్రస్ట్ గొడుగులు సోమవారం తిరుమలకు చేరాయి. ట్రస్ట్‌కు చెందిన పి.గోపాలకృష్ణ శ్రీవారికి 10గొడుగులు విరాళంగా అందిస్తారు. తిరుపతిలో ఈ గొడుగులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాయలసీమరంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, టిడిపి నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, నైనారు శ్రీనివాసులు, సరితా నాగరాజు స్వాగతం పలికారు.

## 3 నుంచి కాణిపాకంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

కాణిపాకం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో ఈనెల 3 నుండి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెట్టెం గురుప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఈఏడాది ఈనెల 3 నుండి 12 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు, ఉభయదారులు, గ్రామస్థులు, పాల్గొని అమ్మవారి తీర్థ, ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



## గంగమ్మ నవరాత్రులకు రారండి...: ఏకాంబరం

చౌడేపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శక్తి స్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నవరాత్రి మహోత్సవాలను ఈనెల 4నుంచి 12వరకు నిర్వహించనున్నారు ఈమేరకు ఆలయ ఇఓ ఉప కమీషనర్ జె.ఏకాంబరం జిల్లాస్థాయి అధికారులను ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హేమవంశీ, డిఆర్ఓ పుల్లయ్యలను ఆహ్వానించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది అధికారులను ఆహ్వానించిన వారిలో వున్నారు.

## అలరించిన అర్జున తపస్సు



సదుం, సెప్టెంబరు30 ప్రభాతవార్త : సదుం పంచాయతీ భట్టువారిపల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం సాయంత్రం అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మధ్యాహ్నం హరికథాకళాకారిణి జ్యోత్సచే అర్జున గర్వభంగం హరికథ వివరించారు. అనంతరం సాయంత్రం పీలేరు వెంకటేశ్వరనాట్య కళామండలి ఆధ్వర్యంలో అర్జున తపస్సు కార్యక్రమం నాటిక ప్రదర్శించారు. ఇందుకు గాను తొలుత పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యండపల్లెమణి, చిన్నరమణ, భాస్కరరాజు, మునిరత్నం, వాసు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో మొదటి పోస్టుమార్టం



చంద్రగిరి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం మొదటి పోస్టుమార్టం చేశారు. రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయంతో ముంగిలిపట్టుకు చెందిన జయపాల్ నాయుడును వైద్య చికిత్సల కోసం ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పరీక్షించి జయపాల్ నాయుడు మృతి చెందినట్లు ధృవీకరించారు. దీనిపై డాక్టర్ పి.అరుణ స్పందించి పోస్టుమార్టం కోసం డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తిని సంప్రదించారు. ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు అనుమతి, సహకారం కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన పుత్తూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకాంత్ ద్వారా పోస్టుమార్టం అసిస్టెంట్ బాలచంద్రను హుటాహుటిన చంద్రగిరికి పంపించారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డాక్టర్ పి.సస్యశ్రీ ఆధ్వర్యంలో మొదటిసారి జయపాల్ నాయుడు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ స్థితి నుండి చంద్రగిరిలో పోస్టుమార్టం నిర్వహించడం ద్వారా కేవలం 4 గంటల వ్యవధిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసి బాధిత కుటుంబ సభ్యులకు ఇబ్బందులు లేకుండా అప్పగించడం జరిగింది. దశాబ్ద కాలానికి పైగా ఎదురు చూసిన ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బందికి ఎంఎల్ఏ పులివర్తి నాని చొరవతో పోస్టుమార్టం గది ప్రారంభానికి నోచుకున్నది.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరు మృతి!

చంద్రగిరి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన విచారకర దుర్ఘటన ఐతేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. దామలచెరువుకు చెందిన ప్రసాద్, మహేష్ ద్విచక్ర వాహనంపై పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వస్తున్నారు. ముంగిలిపట్టుకు చెందిన ముండ్లూరు జయపాల్ నాయుడు ఐతేపల్లి నుండి ముంగిలిపట్టుకు సర్వీస్ రోడ్డులో వెళుతున్నాడు. ఐతేపల్లి సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో జయపాల్ నాయుడు తీవ్రగాయాలపాలయ్యాడు. అదే విధంగా ప్రసాద్, మహేష్‌లకు గాయాలు కావడంతో ప్రైవేటు వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు జయపాల్ నాయుడు మృతి చెందినట్లు ధృవీకరించారు. ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



వడమాలపేట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన చేపట్టరు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. మాడవీధుల్లో ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులకు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పూర్ణహుతితో పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి.

## హెడ్ మాస్టర్ జ్యోతిపై విచారణ

సత్యవేడు, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: సత్యవేడు మండలం దాసుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తూ బదిలైన జ్యోతిపై వచ్చిన పలు ఆరోపణలకు సంబంధించి ముగ్గురు అధికారుల బృందం విచారణ జరిపింది. సోమవారం పొదటూరు డిప్యూటీ డీఈవో కృష్ణప్ప ఆధ్వర్యంలో పీలేరు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కరుణావనీతం బృందం దాసుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్వపు హెచ్ఎం జ్యోతిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వంట కార్మికులు, గ్రామస్తులు తదితరులు నుంచి విచారణ కమిటీ రాత పూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. ఇందులో భాగంగానే విచారణ అధికారులు ప్రశ్నాపత్రాలను అందించడంతో పాటు స్పష్టమైన అభిప్రాయాలను రాయాలని సూచించారు. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, జ్యోతి హయాంలో పని చేసిన ఉపాధ్యాయులతో పాటు పూర్వపు వంట కార్మికులు లీలావతి, సుశీల, రేషన్ డీలర్ రాజ్యలక్ష్మి, గ్రామస్తులు జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, లోకయ్యరెడ్డి తదితరులు ప్రశ్నాపత్రాలు ఆధారంగా వారి అభిప్రాయాలను రాయడం జరిగింది. చదువుకున్న విద్యార్థులు పరీక్షలు రాసినట్టు విచారణ సందర్భంగా అయ్యోర్లు దాదాపు గంట పాటు వారి అభిప్రాయాలను రాయడంతో పాటు ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు కూడా కొందరు జతపరచినట్లు తెలిసింది. ఇదే తరహాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు హెచ్ఎం జ్యోతి కూడా ప్రశ్నాపత్రం ద్వారా అభిప్రాయాలను రాసి విచారణ కమిటీకి అందించారు. కాగా దాసుకుప్పం పూర్వపు హెచ్ఎం జ్యోతిపై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చడానికి విచారణ కమిటీలపై కమిటీలు వేస్తున్న ప్రయోజనం లేకపోతుంది. ఇప్పటికే విచారణ పేరుతో మూడు పర్యాయాలు విచారణ జరిపిన నివేదికలన్నీ ఏమయ్యాయో అంతు చిక్కడం లేదు. విచారణ అధికారుల బృందం ప్రతిసారి విచారణ నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్న చర్యలు నామమాత్రంగా ఉన్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## భాషాజ్ఞానం లేకుండా అనువాదమనేది చాలా కష్టం



తిరుపతి విద్య, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని అనువాద విభాగం ద్వారా ట్రాన్స్‌లేషన్ టెక్నిక్స్ అండ్ చాలెంజస్ అనే అంశం పై రెండు రోజుల జాతీయ సదస్సు విశ్వవిద్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర స్వామి విశ్వవఇద్యాలయం వైస్-చాన్స్‌లర్ ప్రొ.సి.హెచ్. అప్పారావు విచ్చేసి, జాతీయ విశ్వవిద్యాలయం వైస్-చాన్స్‌లర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించడం జరిగినది. ప్రొ.అప్పారావు మాట్లాడుతూ అనువాదమనేది చాలా కష్టమని అందువల్ల భాషాజ్ఞానాన్ని సంపాధించి, తద్వారా వివిధ భాషలలో ఉన్న జ్ఞానాన్ని అందరికి ఈ అనువాదం ద్వారా అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట వక్తగా విచ్చేసిన విద్వాన్ జనార్ధన్ హెగ్డే, అకటమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శక్లా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.ఎన్ లతా ఈ సదస్సు కో ఆర్డినేటర్స్ డా.ఎమ్.జి నందన రావు, డా.కనపాల కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం జరిగినది.

## కొండమిట్టకు పరుగులు తీసిన మున్సిపల్ అధికారులు

వార్తకు స్పందన



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని కొండమిట్ట పరిసరాలకు మున్సిపల్ అధికారులు పరుగులు తీసారు. సోమవారం వార్త దినపత్రికలో 'కొండమిట్టలో విష జ్వరాలు' అనే శీర్షికనవార్త ప్రచురితం కావటంతో అధికారులు పరుగులు తీసారు. ఎఇఇ తేజస్వీ, సచివాలయ కార్యదర్శి జెడి చక్రవర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ మోహన్, ఫిట్టర్ తులసిరామ్, ఎలక్ట్రిషియన్ సుధాకర్, రమేష్‌లు పైప్‌లైన్లను పరిశీలించారు. రెండు చోట్ల లీకేజీలు గుర్తించారు. అలాగే మురుగునీరు మంచినీటి పైప్‌లైన్లో కలుస్తున్నట్లు గుర్తించారు. మంగళవారం రంగయ్యబడి వద్ద ప్రత్యేక వాల్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. మున్సిపల్ నీటిలో క్లోరినేషన్‌కు ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా నీటిని కాచి వడగాచి తీసుకోవాలని సూచించారు.

## ఎట్టకేలకు గాంధీజీ విడుదల!...2న ప్రతిష్ట



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : ఎట్టకేలకు పూజ్యబాపూజీ మహాత్మాగాంధీ దేవస్థానం చెర నుంచి విడుదలయ్యారు. గత ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల నాటికి వాహనాల మండపాన్ని పూర్తి చేయుటకు పురాతన కాలం నాటి గాంధీ మండపం అడ్డంకి అని భావించిన అప్పటి ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తొలగించుటకు నిర్ణయిం చారు. ఈమేరకు విగ్రహాన్ని దేవస్థానంకు సంబంధించిన ఓ వాహనాల మండపంలో బంధించారు. కొత్త మండపం నిర్మాణానికి రూ.2లక్షలతో టెండర్లు పిలిచారు. కానీ దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం మార్కింగ్ ఇవ్వటానికి ఏడాది పాటు నిర్లక్ష్యం చేసారు. ఇటీవల వార్త దినపత్రికల్లో 'దేవస్థానం గోదాములో గాంధీజీ బంది' అనే శీర్షికన వార్త ప్రచురితం కావటంతో పాలకులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికపై రాజగోపురంకు ఉత్తరం వైపు కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్డు పక్కన గాంధీ విగ్రహం ఏర్పాటుకు మండపం నిర్మాణం పనులను చేపట్టారు. ఈ నెల 2న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిచే ఆవిష్కరించుటకు యుద్ధ ప్రాతికపై ఏర్పాట్లు చేస్తున్నారు. రేయింబవళ్ళు కాంట్రాక్టర్‌ను తరుముతున్నారు. సోమవారం సాయంత్రం 'గాంధీ విగ్రహాన్ని' పిల్లర్‌పై నిలబెట్టారు. దాంతో చుట్టుపక్కల ప్రజలు హమ్మయ్యా! బాపూజీకి మోక్షం లభించిందని చర్చించుకుంటున్నారు.

## సిఎం చంద్రబాబు.. లోకేష్‌లను కలసిన రాజ్‌కుమార్



కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను కుప్పం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలో సిఎం నివాస గృహంలో సిఎం, మంత్రి లోకేష్‌లను కలసిన రాజ్‌కుమార్ పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా మున్సిపల్ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై సిఎం చంద్రబాబు ఆరా తీశారు. నేతలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని సిఎం సూచించారు.

## ఘనంగా సోమవారోత్సవాలు



రామకుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో సోమవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ శనీశ్వరస్వామి, శ్రీ వినా యక, ఓంశక్తి ఆలయాలు, నక్షత్రవనం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం జరిపారు. ఆర్డీఓ శ్రీనివాసులు రాజు హాజరై ఉత్సవాన్ని మోశారు. రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

## అర్హులైన పేదలకు తప్పక సంక్షేమ పథకాల్లో లబ్ది : కమీషనర్



కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : మున్సిపల్ పరిధిలో ఉన్న అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామని కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక 19వవార్డులో వార్డు ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్హులకు తప్పకుండా పెన్షన్లు, పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు అతిత్వరలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే కమీషనర్ శ్రీనివాసరావు పరిష్కరించారు. కుప్పం మున్సిపాలిటీని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఆదర్శంగా మలుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, నేతలు ఆర్ముగం, ఆర్ఆర్ రవి, మంజు, శివ, బాలాజీ, సుబ్బు, మహిళా నేత భాగ్యలక్ష్మి త్రిలోక్, శారదమ్మ, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025కు సహకరించండి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎన్. మౌర్య అన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 పై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిదులతో సోమవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఆగస్టు 20 నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు స్పెషల్ వచ్చిన ఫారం వివరాలు అందరికి వివరించారు. కోడ్ నంబర్ల విధానంలో ఉన్న పొరపాట్లను తొలగించాలని రాజకీయ ప్రతినిదులు కోరగా పరిశీలిస్తామని తగు చర్యలు చెపడతామని అన్నారు. యాగ్జలరీ పోలింగ్ కేంద్రాలను, అదనపు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటి జీవన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.